
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ 5
బుధవారం 6 నవంబరు 2024
జిల్లాల వార్తలు





పట్టభద్రులకు పట్టదా!

ఉపాధ్యాయులూ వెనుకబాటే - నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ ఓట్ల నమోదు

- నత్తనడకన ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ
- గడువు పెంచుతారని ఆశ
- విస్తృతంగా ప్రచారం చేసిన పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల ఆశావహులు

ఓటర్ల నమోదు వివరాలు (మంగళవారం వరకు)

జిల్లా	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
సంగారెడ్డి	20,619	2342
సిద్దిపేట	23,504	2781
మెదక్	9528	892



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, నవంబరు 5 : మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే ఏడాది మార్చిలో జరగనున్నాయి. ఒక స్థానంలో గ్రాడ్యుయేట్లు, మరో స్థానంలో ఉపాధ్యాయులు ఓట్లు వేయాల్సి ఉంటుంది. అయితే ఆరేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఎన్నికలకు కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి. గతంలో ఓటు వేసినవారు కూడా ప్రస్తుతం ఓటరుగా తమ పేరును ఎన్‌రోల్‌మెంట్ చేయించాల్సిందే. సెప్టెంబరు 30న ప్రారంభమైన ఓటరు నమోదు ప్రక్రియ నవంబరు 6తో అంటే నేటితో ముగియనున్నది. ఓటర్ల నమోదు గురించి అటు పట్టభద్రుల స్థానం ఆశావహులు.. ఇటు ఉపాధ్యాయ సీటు ఆశావహులు విస్తృతంగా ప్రచారం చేశారు. అయినప్పటికీ ఓట్ల నమోదు నత్తనడకన కొనసాగుతూ వచ్చింది.

2019 మార్చిలో జరిగిన మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల స్థానంలో 1,96,321 మంది తమ ఓటు హక్కు పొందారు. కాగా ప్రస్తుత ఎన్నిక కోసం 2,56,673 మంది ఇప్పటి వరకు తమ పేరిట దరఖాస్తులు సమర్పించారు. గతంతో పోల్చితే 60వేల మంది పెరిగినప్పటికీ ఇది చాలా తక్కువ అని అధికారులు భావిస్తున్నారు. ఇక నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో దాదాపు 30వేల మంది ఉపాధ్యాయులు ఉంటారు. కానీ ఇప్పటివరకు 18,623 మంది మాత్రమే ఓటు కోసం దరఖాస్తు పెట్టారు.

ఉమ్మడి జిల్లాలో 2 లక్షలపైనే గ్రాడ్యుయేట్లు..

సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 2లక్షలపైనే డిగ్రీ పూర్తిచేసిన పట్టభద్రులు ఉంటారని అంచనా. కానీ ఇప్పటివరకు కేవలం 55వేల మంది మాత్రమే ఓటు హక్కు కోసం దరఖాస్తు చేశారు. 25శాతం వంతుకే పరిమితమయ్యారు. ఈరోజు అవకాశం ఉన్నందున మరో 10వేల దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన 65వేలకు మించి దరఖాస్తులు వచ్చే పరిస్థితి లేదని అర్థమవుతోంది. ఇప్పటికే

- మిగతా 7వ పేజీలో...

బాలిక కిడ్నాప్ కలకలం

- ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

దౌల్తాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చిన్నారికి చాక్లెట్ ఆశచూపి కిడ్నాప్‌కు యత్నించిన సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం తిరుమలాపూర్ గ్రామంలో రెండు రోజుల క్రితం చోటుచేసుకుంది. ఈ విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నారి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాపూర్‌లోని బుడగ జంగాలకు చెందిన రాములు కూతురు పల్లవి నాలుగో తరగతి చదువుతోంది. చిన్నారి ఈనెల 3న ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోని పాఠశాల వైపు ఆడుకోవడానికి వెళ్తుంది. గుర్తుతెలియని వ్యక్తులు చిన్నారికి చాక్లెట్ ఆశచూపి దగ్గరకు పిలిచారు. చాక్లెట్‌ను తింటున్న బాలిక నోరు మూసి ఓ వ్యాన్‌లోకి ఎక్కించారు. ఆ తర్వాత మత్తు ఇంజక్షన్ ఇచ్చారు. మత్తు పనిచేయకపోవడంతో చిన్నారి కేకలు వేసింది. స్థానికులు గమనించి వాహనాన్ని వెంబడించగా కిడ్నాపర్లు గ్రామశివారులోని పత్తిచేను వద్ద బాలికను వదిలి పారారయ్యారు. బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన జరిగి మూడు రోజులు దాటినా కూడా విషయాన్ని మీడియాకు చెప్పకుండా, దుండగులను పట్టుకోకపోవడంపై గ్రామస్థులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పశువుల లెక్క.. పక్కా..!

- నేటి నుంచే పశుగణన

సంగారెడ్డి టౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పశువుల లెక్కను పక్కాగా తేల్చేందుకు సంగారెడ్డి జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి పశుగణన జరుగనున్నది. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పశువుల వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారు. ఇందుకోసం కలెక్టర్ క్రాంతి వల్లూరి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆ శాఖ సిబ్బందికి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంత కుమారి పర్యవేక్షణలో పశుగణన జరుగనున్నది.

మూడు నెలలపాటు..

ఈ నెల 6 నుంచి 2025 ఫిబ్రవరి 28వరకు మూడు నెలల పాటు పశువుల వివరాలను సేకరించనున్నారు. పశుగణనకు 131మంది ఎన్యూమరేటర్లు, 33మది సూపర్‌వైజర్లను నియమించారు. మూడు నెలల పాటు జరిగే పశుగణనలో గేదెలు, గొర్రెలు, ఆవులు, కుక్కలు, మేకలు, కోళ్ల, బర్రెలతోపాటు వివిధ రకాల పశువుల వివరాలను సేకరించనున్నారు.

ప్రస్తుతం 2237,478 పశువులు

ఐదేళ్ల క్రితం చేపట్టిన పశుగణన ప్రకారం సంగారెడ్డి జిల్లాలో 22,37, 478 పశువులు ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇందులో కోళ్లు అత్యధికంగా 12,24, 578, ఆవులు, ఎద్దులు 1,56,282, గేదెలు 1,68,995, గొర్రెలు 4,38,475, మేకలు 2,29,311, పందులు 3553, కుక్కలు 13,486 ఉన్నట్లు చెప్పారు. ఐదేళ్లకోసారి దేశవ్యాప్తంగా కేంద్రప్రభుత్వం పశుగణన చేపడుతుంది. నిజానికి 2023లో జరగాల్సి ఉండగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసింది. ఈ వివరాల ఆధారంగానే ప్రభుత్వం పాడి అభివృద్ధికి పథకాల అమలు, వ్యాక్సిన్ల పంపిణీ చేయనున్నది. ఇప్పటివరకు 20సార్లు పశుగణన జరిగింది.

పకడ్బందీగా ప్రక్రియ..



పశుగణన ప్రక్రియ పకడ్బందీగా చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. మూడునెలలపాటు సిబ్బంది ఇంటిటికీ తిరుగుతూ పశువులతో పాటు యజమానుల వివరాలను సేకరించి ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తారు. పశుగణనకు అందరూ సహకరించాలి.

-వసంతకుమారి, సంగారెడ్డి జిల్లా పశువైద్యాధికారి

చివరి గింజ వరకూ కొనుగోలు చేయాల్సిందే

- టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలి
- అధికారులకు సంగారెడ్డి, మెదక్ కలెక్టర్ల ఆదేశం

జోగిపేట/నర్సాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చివరి గింజ వరకూ వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిందేనని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. జోగిపేట మండలం నాదులాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ క్రాంతి ఆకస్మికంగా తనిఖీ చేసి తూకానికి వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. అలాగే మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ నర్సాపూర్ మండలం ఎర్రకుంటతండాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సరిపడా టార్పాలిన్లకు అందుబాటులో ఉంచాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. అంతకుముందు ఆమె నాదులాపూర్ వెళ్తుండగా మార్గ మధ్యలో హార్వెస్టర్‌తో వరికోత చేపట్టడాన్ని పరిశీలించారు. తాలు, చెత్త లేకుండా హార్వెస్టర్‌లో ఆర్‌పీఎం ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ముగ్గురు టీచర్లు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆతర్వాత గ్రామలంలో పారిశుధ్య పనులపై గ్రామస్థులను ఆరా తీయగా.. పంచాయతీ కార్యదర్శి పుష్పలత పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేస్తుందని పలువురు బదులిచ్చారు. కలెక్టర్ వెంట శిక్షణ కలెక్టర్ మనోజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి, డీఆర్‌డీఏ ఏపీడీ జంగారెడ్డి, ఎంపీడీవో రాజేశ్, ఐకేపీ ఏపీఎం మాణిక్యం, వ్యవసాయాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ సన్నరకం, దొడ్డు రకం ధాన్యానికి వేర్వేరుగా తూకం వేయాలన్నారు. ట్యాబ్ ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ సిద్దిరామ్‌రెడ్డి, ఎఈవో తేజస్విని పాల్గొన్నారు. అనంతరం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలోని పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్, ఇతర రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు.



నాదులాపూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

పెరుగుతున్న చలి



చిన్నకోడూరు : ఉదయం వేళలో మంచు

- అత్యల్పంగా కొండపాకలో 15.1 డిగ్రీలు

మెదక్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శీతకాలం ప్రారంభంలోనే ఉమ్మడి మెదక్ జిల్లాపై చలి పంజా విసురుతున్నది. రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటలు దాటినా చలి తగ్గడం లేదు. మంచు కురుస్తుడడంతో చలి తీవ్రత మరింత పెరుగుతున్నది. మంగళవారం అత్యల్పంగా సిద్దిపేట జిల్లా కొండపాకలో 15.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. గౌరారం 15.6, బేగంపేట 15.7, హబ్షీపూర్ 15.8 డిగ్రీలు నమోదైంది. ఇక సంగారెడ్డి జిల్లా నల్లవెల్లిలో 15.7 డిగ్రీలు, మెదక్ జిల్లా డీ ధర్మారంలో 15.8 డిగ్రీలు నమోదైంది.

రికార్డు ప్రసవాలు

సంగారెడ్డి ఎంసీహెచ్ ఘనత

- గత నెలలో ఏకంగా 836 కాన్పులు
- సాధారణ 459, సీజేరియన్ 377
- నాణ్యమైన వైద్య సేవలకు ప్రజల కితాబు

అనుభవం కలిగిన గైనకాలజిస్టులు, వైద్యులకు నిలయం సంగారెడ్డి మాతా శిశు ఆరోగ్యం కేంద్రం (ఎంసీహెచ్). అతి క్లిష్టమైన (హైరిస్క్) కాన్పులు కూడా సమర్థవంతంగా నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు డాక్టర్లు. యేటా రాష్ట్రంలోనే ఇక్కడ అత్యధిక కాన్పులు జరుగుతున్నాయంటే వారి పనితీరుకు నిదర్శనం. గత నెలలో రికార్డు స్థాయిలో కాన్పులు నమోదు కాగా ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



సంగారెడ్డి అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ హంగులు, మెరుగైన వైద్య సేవలందిస్తున్న సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రసవాల్లో భేష్ అనిపించుకుంటుంంన్నది. రాష్ట్రంలోనే అత్యధిక ప్రసవాలు ఇక్కడ జరుగుతాయన్న ప్రచారం ముందు నుంచే ఉన్నా.. గత నెలలో రికార్డు స్థాయిలో ప్రసవాలు జరగడం విశేషం. నిత్యం సుమారు 30 ప్రసవాలు జరుగుతుండగా అందులో సగానికిపైగా సాధరణ కాన్పులే కావడం గమనార్హం. గర్భిణులు, బాలింతలతో ఎప్పుడూ కిక్కిరిసి కనబడే సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌లో అత్యధిక ప్రసవాలు జరగడం డాక్టర్లు, సిబ్బంది పనితీరుకు అద్దం పడుతున్నది.

అక్టోబరులో 836 డెలివరీలు..

ఎంసీహెచ్‌లో 2024 సంవత్సరంలో జరిగిన ప్రసవాలను పరిశీలిస్తే జనవరిలో 705, ఫిబ్రవరిలో 604, మార్చిలో 673, ఏప్రిల్‌లో 759, మేలో 782, జూన్‌లో 645, జూలైలో 706, ఆగస్టులో 799, సెప్టెంబరులో 712, అక్టోబరులో 836 ప్రసవాలు జరిగాయి. గడిచిన పది నెలల కాలంలో అత్యధికంగా అక్టోబరు మాసంలో సాధారణ 459, సీజేరియన్ 377 ఇలా మొత్తం 836 ప్రసవాలు జరిగాయి.

- మిగతా 8వ పేజీలో...

సమష్టి కృషితోనే...



ఎంసీహెచ్ డాక్టర్లు, సిబ్బంది సమష్టి కృషి వల్లే అత్యధిక ప్రసవాలు చేయడం సాధ్యమైంది. సాధారణ ప్రసవాలే లక్ష్యంగా, మతా శిశు సంరక్షణే ధ్యేయంగా చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో ఇక్కడ ప్రసవాలు జరగడం ఇక్కడి వైద్యులు, సిబ్బంది పనితీరుకు నిదర్శనం.

- అనిల్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్, సంగారెడ్డి

అమీన్‌పూర్‌లో హైడ్రా సర్వే

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్‌లో హైడ్రా అధికారులు సర్వే చేపట్టారు. పార్కులు, రహదారులు కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు అందడంతో హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ ఆదేశాలతో మంగళవారం సర్వే చేశారు. ఎకరాకు పైగా ఉన్న పార్కున్నలంతో పాటు, రహదారులను గోల్డెన్ కీ వెంచర్ వాళ్లు కబ్జా చేశారంటూ వెంకటరమణ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఇరు పక్షాలు కోర్టును ఆశ్రయించడంతో హై కోర్టు ఆదేశాల మేరకు సర్వే చేయించారు. మొత్తం 5 సర్వే నంబర్లలో 150 ఎకరాలకు పైగా పరిశీలించారు.



సర్వే చేస్తున్న అధికారులు

సమగ్ర సర్వేకు వేళాయె..



- నేటి నుంచే సమగ్ర కుటుంబ సర్వే
- మూడు రోజులు ఇళ్ల జాబితా తయారు
- 75 అంశాలపై వివరాలు సేకరణ
- సర్వే పూర్తయిన ఇంటికి స్టిక్కరింగ్

మెదక్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వేకు తెలంగాణ సర్కార్ సర్వం సిద్ధం చేసింది. నేటి నుంచి 15 రోజుల పాటు సర్వే కొనసాగనుండగా, సిబ్బంది ఇంటింటికీ వివరాలను సేకరించనున్నారు. కుటుంబ యజమాని, సభ్యులు, వృత్తి, అప్పు, ఆస్తులు, ఫోన్ నంబర్లు వంటి 75 అంశాలకు సంబంధించి వివరాలను నమోదు చేయనున్నారు. కుటుంబంలో ఎవరైనా విదేశాలకు వెళ్లినట్లయితే, ఆ వివరాలు ప్రత్యేకంగా సేకరిస్తారు. విదేశాలకు వ్యాపార రీత్యా వెళ్లిన వారికి ప్రత్యేక కోడ్లను ఉపయోగిస్తారు. కుటుంబంలో ఎవరైనా ప్రజాప్రతినిధిగా ఎన్నికై ఉంటే.. రిజర్వేషన్ కోటాలోనా, ఎన్నిసార్లు ఎన్నికయ్యారో నమోదు చేస్తారు. ఈ సర్వే కోసం సెన్సెస్ డైరెక్టరేట్ నుంచి ఈబీ మ్యాపులను పొందారు. లేని ప్రాంతాల్లో కొత్త మ్యాపులను రూపొందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. సర్వే కోసం ఇళ్లను ఎన్యుమరేషన్ బ్లాకులుగా విభజిస్తున్నారు. ఒక గ్రామంలో కుటుంబాల సంఖ్య 150 వరకు ఉంటే వాటిని ఒకే ఈబీగా నిర్ణయించి సర్వే చేపట్టనున్నారు.

ఇళ్లకు స్టిక్కర్లు..

తొలి రెండు రోజుల్లో ఇంటింటి గణనలో భాగంగా ప్రతీ ఇంటికి స్టిక్కర్ అతికించనున్నారు. సర్వే పూర్తయిన తర్వాత మార్కర్ పెన్‌తో తేదీని లిఖించనున్నారు. 8 వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో సర్వే కొనసాగించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. వెనకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల మెరుగుదలకు ఈ సర్వే ఉపకరిస్తుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. మెదక్ జిల్లాలో 2,13,950 కుటుంబాలున్నాయి.

1571 ఎన్యుమరేషన్ బ్లాకులు..

సర్వే సజావుగా సాగడానికి ప్రభుత్వం ఎన్యుమరేషన్ బ్లాకులుగా విభజించింది. మెదక్ జిల్లాలో 1571 ఎన్యుమరేషన్ బ్లాకులు ఏర్పాటు చేశారు. సర్వే నిర్వహణకు గ్రామీణ ప్రాంతాల్లో 1468 మంది, పట్టణ ప్రాంతాల్లో 256 మందితో కలిపి మొత్తం 1724 మంది ఎన్యుమరేటర్లను కలెక్టర్ నియమించారు. సర్వే పర్యవేక్షణకు గ్రామీణ ప్రాంతాలకు 160 మంది, పట్టణ ప్రాంతాలకు 26 మందితో కలిపి మొత్తం 186 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయులతో పాటు ఇతర కేటగిరిలకు చెందిన ఉద్యోగులను నియమించారు. ఏఈవోలు, ఏపీడబ్ల్యూలు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, ఆర్పీలు, పంచాయితీ కార్యదర్శులు సర్వేలో పాలుపంచుకోనున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు పది ఇళ్ల చొప్పున 15 రోజుల్లో 150 ఇండ్లకు సంబంధించిన సర్వే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రతీ ఎన్యుమరేటర్‌కు ప్రత్యేక కిట్‌బ్యాగు అందజేశారు. ఇందులో స్టేషనరీ సహా సర్వే కాపీలు ఉంటాయి. సర్వే వివరాలను ప్రతీ రోజూ మండలాల వారీగా ప్రత్యేకంగా నియమించిన ఆపరేటర్లతో ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు. ఇందుకోసం డాటా ఎంట్రీ ఆపరేటన్లు నియమించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే చేసే ప్రాంతాల్లో ఒకరోజు ముందే ప్రజలకు సమచారం అందించి సర్వేకు అవసరమైన పత్రాలు సిద్ధంగా ఉంచుకునేలా చూడాలన్నారు.



చిరుధాన్యాల చెల్లెలిని సన్మానిస్తున్న ప్రముఖులు

చిరుధాన్యాల సాగును పెంచాలి

- వాతావరణానికి అనుగుణంగా పంటలను మార్చాలి
- దక్షిణ భారతదేశ కేవీకేల అధిపతి షేక్ ఎస్. మీరా

7

బొద్దింకలు పడ్డ కల్లు తాగి పదిమందికి అస్వస్థత

- ఒకరి పరిస్థితి విషమం.. ఆస్పత్రికి తరలింపు

7

విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజులు చెల్లించాలి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్యార్థులు సకాలంలో తమ పరీక్ష ఫీజు చెల్లించాలని డీఐఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 26 వరకు గడువు ఉన్నదని పేర్కొన్నారు. ఫస్ట్ ఇయర్ ఆర్ట్స్, సైన్స్, సెకండ్ ఇయర్ ఆర్ట్స్ గ్రూపుల విద్యార్థులు రూ.520, సెకండ్ ఇయర్ సైన్స్ విద్యార్థులు, ఒకేషనల్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు రూ.750 చెల్లించాల్సి ఉంటుదన్నారు. రూ.100 ఫైన్‌తో డిసెంబరు 4 వరకు, రూ.500 ఫైన్‌తో డిసెంబరు 11 వరకు, రూ.1000 అపరాధ రుసుముతో డిసెంబరు 18 వరకు, రూ.2 వేల అపరాధ రుసుము డిసెంబరు 27 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉన్నట్లు డీఐఈవో తెలిపారు.

రైతులు చిరుధాన్యాల సాగు పెంచాలి

- వాతావరణానికి అనుగుణంగా పంటలను మార్చాలి
- దక్షిణ భారతదేశ కేవీకేల అధిపతి షేక్ ఎస్. మీరా


స్వచ్ఛందసంస్థల సభ్యులతో దక్షిణ భారతదేశం కేవీకేల అధిపతి షేక్ ఎస్. మీరా

జహీరాబాద్, నవంబరు 5: వాతావరణానికి అనుగుణంగా రైతులు పంటలను మార్చాలని ఐసీఆర్-అటారీ డైరెక్టర్, దక్షిణభారతదేశం కేవీకేల అధిపతి షేక్ ఎస్ మీరా పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని డిడిగి శివారులోగల డీడీఎస్-కేవీకే (డెక్కన్ డెవలప్‌మెంట్-కృషి విజ్ఞానకేంద్రం)లో చిరుధాన్యాల చెల్లెళ్ల జాతీయస్థాయి 4వ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో నాగాలాండ్, గుజరాత్, ఒడిషా, పశ్చిమబెంగాల్, తమిళనాడు, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని చిరుధాన్యాలను సాగుచేసే 17 స్వచ్ఛంద సంస్థలకు చెందిన సభ్యులు, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో షేక్ ఎస్. మీరా మాట్లాడుతూ అంతరించిన చిరుధాన్యాలకు జీవం పోసిన డీడీఎస్ రైతుల పనితీరును అభినందించారు. దేశంలో చిరుధాన్యాల వినియోగం పెరిగినప్పటికీ అందుకు అనుగుణంగా ఉత్పత్తులను పెంచాలన్నారు. చిరుధాన్యాలను సాగుచేసే రైతులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిరంతరం సాగు చేయాలన్నారు. ప్రస్తుతం 11.08మిలియన్ టన్నుల చిరుధాన్యాల ఉత్పత్తి ఉండగా, దీనిని 20 మిలియన్‌టన్నుల మేర ఉత్పత్తి చేసేందుకు చిరుధాన్యాల చెల్లెళ్లు ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా చిరుధాన్యాల సాగు, వినియోగం కొత్తతరానికి పరిచయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిరుధాన్యాల సాగుకు సంబంధించి అఖిల భారతస్థాయిలో చిరుధాన్యాల చెల్లెళ్ల సమాఖ్యను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. చిరుధాన్యాలను సాగును పెంచేందుకు ప్రభుత్వాలు తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందన్నారు. చిరుధాన్యాల్లో ఆహారభద్రత, పోషక భద్రత ఉన్నాయన్నారు. నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ స్వాతి తివారీ మాట్లాడారు. సమావేశంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కోనింటి మాణిక్‌రావు, డీడీఎస్ ఈడీ దివ్య, డీడీఎస్ డైరెక్టర్లు రుక్మిణీరావు, రామాంజనేయులు, డీడీఎస్‌జాయింట్ డైరెక్టర్ గిరిధర్, మహిళారైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

చిరుధాన్యాల చెల్లెళ్ల జాతీయస్థాయి 4వ సదస్సు సందర్భంగా నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. మొత్తం 53 రకాల విత్తనాలను ఈ సదస్సులో ప్రదర్శించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. బుధవారమూ జరిగే ఈ సదస్సులో మిల్లెట్ సాగులో విజయం సాధించిన మహిళా రైతుల పరిచయ కార్యక్రమం ఉంటుంది. ఆహుతులు ఆయా రాష్ట్రాల మహిళారైతుల పండించిన చిరుధాన్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు.

గుట్టలపై కందకాలు తవ్వించి జలసంరక్షణ



హిమాచల్‌ప్రదేశ్‌లో చెప్పుకోదగ్గ పంటలు పండవు. కొండలు, అటవీప్రాంతం ఎక్కువగా ఉంటుంది. బీళ్లుగా ఉన్న గుట్టలపై కందకాలు తవ్వించి జలసంరక్షణ చర్యలు చేపట్టి వర్షాధారిత పంటలను పండిస్తున్నం. గావ్‌కా జంగల్, గావ్‌కా హాత్‌మే అనే నినాదంతో పని చేస్తున్నాం. దశాబ్దాల క్రితం నిర్మాణ్ అనే ఎన్‌జీవో సంస్థను ఏర్పాటు చేసి దేశంలో మిల్లెట్ నెట్‌వర్క్ సిస్టమ్‌తో కలిసి పని చేశాం. 65 మహిళా సంఘాలతో గ్రూపులను ఏర్పాటు చేశాం. శాస్త్రవేత్తల సలహాతో వర్మీకం పోస్టు తయారు చేశాం. చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం గతేడాది పద్మశ్రీ అవార్డులో సత్కరించింది.

- పద్మశ్రీఅవార్డు గ్రహీత నేకరాం శర్మ

యువతిపై దాడి చేసిన నిందితుడి అరెస్ట్

మెదక్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద యువతిపై కత్తితో దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ మంగళవారం వివరాలను వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన దనసిరి చైతన్య బెంగళూరులో ఉంటున్నాడు. 2022లో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆవుసులపల్లి గ్రామానికి చెందిన ఓ యువతితో పరిచయం చేసుకొని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. యువతి నిరాకరించడంతోపాటు దూరంగా ఉంచడంతో కక్ష పెంచుకొని సోమవారం ఆమె పరీక్ష రాసేందుకు రాగా, వాగ్వాదానికి దిగి కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఘటన జరిగిన 24 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద సెల్‌ఫోన్, రక్తపు మరకలు అంటిన షర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపించినట్లు డీఎస్పీ తెలిపారు.

బొద్దింకలు పడ్డ కల్లు తాగి పదిమందికి అస్వస్థత

ఒకరి పరిస్థితి విషమం.. ఆస్పత్రికి తరలింపు

రామాయంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాలలో మంగళవారం బొద్దింకలు పడ్డ కల్లు తాగి పది మంది అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలోని కల్లు దుకాణంలో పలువుర మంగళవారం కల్లు తాగారు. అందులో సుమారు పది మంది వాంతులు చేసుకున్నారు. అస్వస్థతకు గురైన వారిని గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కల్లు సీసాల్లో చూడగా, బొద్దింకలు కనిపించాయి. కల్లు దుకాణం నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే సీసాల్లో బొద్దింకలు వచ్చాయని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

స్కూల్ ఆటో బోల్తా...

13 మంది విద్యార్థులకు గాయాలు

దుబ్బాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్కూల్ విద్యార్థులను తీసుకుని వస్తున్న ఆటో బోల్తాపడి 13 మంది విద్యార్థులకు గాయాలైన సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాకలో మంగళవారం జరిగింది. వివరాలు ఉన్నాయి. దుబ్బాకలోని గాయత్రీ వివేకానంద విద్యాలయానికి కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన 13 మంది విద్యార్థులు మంగళవారం ఓ ప్రైవేట్ ఆటోలో పాఠశాలకు వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో పెద్దచీకోడ్ గ్రామ శివారులో అదుపు తప్పి.. చెట్టుకు బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న 13 మంది విద్యార్థులకూ గాయాలయ్యాయి. స్థానికులు బోల్తా పడిన ఆటోలో నుంచి విద్యార్థులను బయటికి తీశారు. వెంటనే వారిని 108 వాహనంలో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొంత మందిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

బైక్‌ను ఢీ కొన్న ఆటో.. ఒకరు మృతి

జగదేవ్‌పూర్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను టాటా ఏసీ వాహనం ఢీ కొన్న ఘటనలో ఒకరు మృత్యువాత పడ్డారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొంతం అశోక్‌కుమార్(48) ఫర్టిలైజర్ కొనుగోలు చేసేందుకు జగదేవ్‌పూర్ వెళ్లాడు. అక్కడి ఓ పెట్రోల్ పంపులో ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోసుకోవడానికి వెళ్తుండగా ప్రజ్ఞాపూర్ వైపు నుంచి వస్తున్న టాటా ఏసీ వాహనం బలంగా ఢీ కొట్టింది. దీంతో అశోక్ కుమార్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. జగదేవ్‌పూర్ ఎస్సై చంద్రమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


లక్ష్మణ్ (ఫైల్)

కంది, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పనులు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం కంది మండలంలోని బ్యాతోల్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన లక్ష్మణ్ (20)ది రేకుల షెడ్డులాంటి ఇల్లు. ఆ ఇంటికి కరెంట్ కనెక్షన్ కోసం వినియోగించిన సర్వీస్ వైర్ నాసిరకంగా ఉండి.. అక్కడక్కడ పగుళ్లు వచ్చింది. దీంతో కరెంట్ రేకుల షెడ్డులో నుంచి సపోర్ట్ పైప్‌లకు ప్రవహించింది. లక్ష్మణ్ అనుకోకుండా ఇంటి ముందర ఉన్న పైపును పట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు.


వ్యవసాయ అధికారితో మాట్లాడుతున్న రైతులు

తేమతో తంటా..

బోర్డుపై 17 శాతం.. తూకం 15 శాతం ఉంటేనే..

కొర్రీలు పెడుతున్న అధికారులు

కౌడిపల్లి, నవంబరు (ఆంధ్రజ్యోతి) 5: ధాన్యం కొనుగోలు విషయంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పెడుతున్న కొర్రీలతో రైతులు దిక్కుతోచకున్నారు. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బోర్డుపై తేమ 17 శాతం వరకు ఉంటే సరిపోతుందని ఉండగా, అధికారులు మాత్రం 15 వరకు తేమ ఉంటేనే తూకం వేస్తామని తెలపడంతో రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. కౌడిపల్లి మండలం ధర్మసాగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం 15 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేయాలని అధికారులు చెప్పారు. దీంతో సుమారు 50 మంది రైతులు బోర్డుపై 17 శాతం ఉంటే సరిపోతుందని ఉండగా, ఇదేమిటని అధికారులను ప్రశ్నించారు. ధాన్యం తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకుండా.. ఇప్పుడు కొర్రీలు పెట్టడం ఎంత వరకు సమంజసం అని రైతులు యాదవరెడ్డి, వీరయ్య, కిష్టయ్య, శాగ లచ్చయ్య, దుర్గయ్య, నవీన్, శ్రీను, మల్లయ్య, ఎల్లయ్య, వడ్డె రాములు తదితరులు ప్రశ్నించారు. వ్యవసాయ విస్తరణ అధికారి సాహితీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించేందుకు రాగా, ఇదే విషయాన్ని రైతులు అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తున్నామని, తామేం చేయలేమని ఆమె చేతులెత్తేశారు.

టీచర్లంతా ఓటుహక్కు పొందాలి

పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి



సిద్దిపేట, నవంబరు 5, ఆంధ్రజ్యోతి: మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన సిద్దిపేట నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో పర్యటించారు. నేటితో ఓటర్ల నమోదు గడువు ముగుస్తున్నందున అప్రమత్తం కావాలని సూచించారు. తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపిస్తే టీచర్ల హక్కులతోపాటు పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయులంతా ఎక్కడికక్కడ ఓటర్ల నమోదు ప్రక్రియలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

పట్టభద్రులకు పట్టదా!

5వ పేజీ తరువాయి..

పట్టభద్రుల స్థానంలో బరిలో నిలవనున్న ఆశావహులంతా పోటాపోటీగా ప్రచారం చేశారు. ఒకరిద్దరైతే ప్రతీ జిల్లా కేంద్రంలో ఓటరు ఎన్‌రోల్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. మార్నింగ్ వాక్‌లో, పాఠశాలల్లో, కంపెనీలలో, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అవగాహన చేపట్టారు. అయినప్పటికీ చాలా మంది పట్టభద్రులు ఈ ఎన్నికపై ఆసక్తి చూపడం లేదు.

మందకొడిగా ఉపాధ్యాయులూ..

ప్రభుత్వ ఉన్నత, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా, గురుకులం, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఇతర ప్రభుత్వ సంబంధిత విద్యాసంస్థల్లో మూడేళ్లపైగా బోధనానుభవం ఉన్నవారంతా టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో ఓటేయడానికి అర్హులు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో ఇలాంటి వారి సంఖ్య దాదాపు 9వేలకు పైనే ఉంటుందని అంచనా. ఇప్పటివరకు 6వేల మంది మాత్రమే దరఖాస్తులు సమర్పించారు. ఇంకా సుమారు 3వేల మంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో ఉపాధ్యాయుల ఓట్లపై పూర్తిగా అవగాహన కొరవడింది. అధికారులు, విద్యాశాఖ అధికారులు ఈ విషయంపై అంతంతమాత్రంగానే ప్రచారం నిర్వహించారు. ఇక పీఆర్‌టీయూ సంఘం తరఫున అధికారిక అభ్యర్థిగా నిలిచిన వంగ మహేందర్‌రెడ్డి మాత్రమే యాక్టీవ్‌గా ఓటర్ల నమోదులో పాల్గొంటున్నారు. మరే ఇతర ఆశావహులు, అభ్యర్థులు తెరమీద కానరావడం లేదు.

ఒక్కరోజే గడువు..

ప్రతిష్ఠాత్మకమైన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందాలంటే ఫారం-18ను పూరించాలి. తమ వివరాలతో పాటు ఆధార్ కార్డు, ఓటరు ఐడీ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, డిగ్రీ సమాంతర అర్హత జీరాక్స్ పత్రాలను సమర్పించాలి. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అదే విధంగా అన్ని జిల్లా కేంద్రాలు, డివిజన్, మండల రెవెన్యూ కార్యాలయాల్లోనూ ఆఫ్‌లైన్‌లోనూ సమర్పించవచ్చు. రాబోయే ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లే కీలకం కానున్నాయి. బరిలో ఉండే అభ్యర్థులంతా పట్టభద్రుల చుట్టూ ప్రదక్షిణలు చేసే పరిస్థితులుంటాయి. ఇక ఫారం-19 ద్వారా ఉపాధ్యాయులు తమ వివరాలతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునే వీలుంది. తమ హక్కులు, పాఠశాలల అభివృద్ధి గురించి చట్టసభల్లో గళం వినిపించే ఎమ్మెల్సీని ఎన్నుకునే అవకాశం ఉపాధ్యాయులకు ఉంది. కాగా గడువు కూడా పెంచే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

ఇద్దరు గంజాయి విక్రేతలకు జైలు

ఒక్కొక్కరికీ ఐదేళ్లు..



జిన్నారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించిన కేసులో ఇద్దరు నిందితులకు డిస్ట్రిక్ సెసెన్స్ కోర్టు జయంతి వేర్వేరుగా ఐదు సంవత్సరాల జైలు, రూ. 25వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ వెల్లడించారు. మంగళవారం కేసు వివరాలు ఆయన వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022 జూన్ 14న ఇద్దరు గంజాయి విక్రయిస్తున్నారని ఒకరు ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. తులారం పేడా, ప్రేమ్ మేహర్ అనే వ్యక్తులు తాము అద్దెకు ఉంటున్న ఇంట్లో సూట్‌కేసులో ఆరు కేజీల గంజాయిని దాచి ఉంచారు. దానిని స్వాధీనం చేసుకుని, పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నేరం నిర్ధారణ కావడంతో ఇద్దరు నిందితులకు వేర్వేరుగా ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 25వేల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. కేసును పరిశోధించిన బొల్లారం పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.

రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ షురూ

సంగారెడ్డి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలుర 68వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పది ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. డీఈవో వెంకటేశ్వర్లు జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, హోప్ న్యూరో అండ్ కార్డియాక్ ఆస్పత్రి ఎండీ. డా.కృష్ణమూర్తి, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్యమ్మ, డీవైఎస్‌వో ఖాసీంబేగ్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావీద్‌అలీ, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజీఅనంతకిషన్, సంగారెడ్డి ఎంఈవో విద్యాసాగర్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

కొండాపూర్‌లో ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్

కొండాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సీ.హెచ్. కోనాపూర్‌లో రెండో రోజు ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగింది. స్థానిక ఎంఏ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన టోర్నమెంట్‌లో నిజామాబాద్, నల్లగొండ జట్లు


విజయం సాధించిన కరీంనగర్ జిల్లా జట్టు

విజయం సాధించినట్లు మెదక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

చేగుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీలకు బాల, బాలికలను ఎంపిక చేసినట్లు కోచ్ కరణం గణేష్‌రవికుమార్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమేష్, పీఈటీల సంఘం అధ్యక్షుడు నాగరాజు, సెలక్షన్ కమిటీ ఇన్‌చార్జి శారద తెలిపారు. అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభాగంలో ఎంపికలకు 350 మంది హాజరు కాగా, ఇందులో 36 మంది బాలికలు, 36 మంది బాలురను ఎంపిక చేశామని, మేడ్చల్‌లో ఈనెల 10 నుంచి 12 వరకు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని వివరించారు.

8 నుంచి హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక

హుస్నాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఉమ్మడి మెదక్ జిల్లా బాలబాలికల హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక పోటీలను హుస్నాబాద్‌లోని మిని స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు పిజికల్ డైరెక్టర్ రావుల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం 14 సంవత్సరాల బాలబాలికలకు జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు.

గంజాయి వ్యాపారాలు మానుకోవాలి

-జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి

జహీరాబాద్, నవంబరు 5: గంజాయి వ్యాపారం చేస్తూ స్మగ్లర్లుగా నేరాల్లో ఇరుక్కుపోతే జీవితాంతం ఇబ్బందులు పడాల్సి వస్తుందని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శేఖాపూర్ తండాలోలో మంగళవారం కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. 15మంది అనుమానితులను, 50వాహనాలను సీజ్‌చేశామన్నారు. ఆనంతరం సీఐ శివలింగం మాట్లాడుతూ గంజాయి స్మగ్లింగ్ చేసేవారి విషయంలో కఠినచర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి స్మగ్లింగ్ చేసేవారు స్వచ్ఛందంగా లొంగిపోవాలన్నారు. రూరల్ సీఐ. జక్కుల హన్మంతు, ఎస్ఐ కాశీనాథ్ పాల్గొన్నారు.

చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

వట్‌పల్లి, నవంబరు 5. (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు, గర్భిణులకు బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం ప్రతి ఒక్కరికి అందించేలా చూడాలని వట్‌పల్లి ఎంపీడీవో శశిప్రభ అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశించారు. మంగళవారం మండలంలోని షాద్‌నగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమే అకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని గొరైకల్ శివారులోని ఎల్ఆర్ఎస్ డాటా ఎంట్రీని పరిశీలించారు.

టెలికామ్ బోర్డు అడ్వైజరీ కమిటీ మెంబర్లుగా నియామకం

సంగారెడ్డి అర్బన్/నర్సాపూర్ నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ టెలికామ్ బోర్డు అడ్వైజరీ కమిటీ మెంబర్లుగా బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ప్రసాద్ రవిశంకర్, నర్సాపూర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మంగళవారం వారికి హైదరాబాద్‌లో నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా రవిశంకర్, సురేష్‌లు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యను అందించాలి

పెద్దశంకరంపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మెదక్ జిల్లా విద్యాశాఖ పరిశీలకులు నితిన్‌అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట మండలపరిధిలోని బద్దారం, పెద్దశంకరంపేటప్రాథమిక పాఠశాలలను మండల విద్యాధికారితో కలిసి పరిశీలించారు. ఆయా పాఠశాలలో పలు రికార్డులను వారు పరిశీలించారు. వెంట ఎంఈవో డి.వెంకటేశం, సిబ్బంది ఉన్నారు.

బస్సు సౌకర్యం కోసం మంత్రి పొన్నంకు వినతి

జిన్నారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాజీపల్లి 181 కాలనీకి బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు రమాకాంత్ వినతి పత్రం అందజేశారు. మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాజీపల్లి ఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు రమాకాంత్ కలిశారు. ఔటర్ రింగు రోడ్డు పక్కనే ఉన్న 181 జర్నలిస్టు కాలనీలో సుమారు 800 కుటుంబాలు నివాసం ఉంటున్నా.. రవాణా సదుపాయం లేదని తెలిపారు. మియాపూర్ నుంచి కాలనీ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందజేయగా.. మంత్రి సానుకూలంగా స్పందించారని రమాకాంత్ తెలిపారు.

పీహెచ్‌సీకి నిధులు మంజూరు.

నిజాంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిధులు మంజూరు చేసిందని త్వరలో నిర్మాణ పనులు చేపడతామని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కింద వైద్యాధికారిని నియమించిందని, త్వరలో ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

ఎరువుల దుకాణదారులు లైసెన్సు కల్గిఉండాలి

నర్సాపూర్,నవంబరు5(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుల మందులు విక్రయించే వ్యాపారులు కచ్చితంగా లైసెన్సు కల్గి ఉండాలని వ్యవసాయశాఖ ఇన్‌చార్జి సహాయ సంచాలకులు పుణ్యవతి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని విత్తన, ఎరువులు,పురుగుల మందుల దుకాణాలతో పాటు వ్యవసాయ సహకార సంఘాన్ని ఇన్‌చార్జి సహాయ సంచాలకులు పుణ్యవతి, మండల వ్యవసాయ అధికారి దీపికతో కలిసి సందర్శించి తనిఖీలు చేశారు.

మాదారంలో ఘనంగా ఎల్లమ్మ జాతర

జిన్నారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మాదారంలో ఎల్లమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం మాదారం అంబేడ్కర్ కాలనీలోని ఎల్లమ్మ ఆలయం ఉత్సవాలలో స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. జాతర సందర్భంగా ఆలయంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, నాయకులు, స్థానికులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రారంభాలే తప్ప కొనుగోలు చేయరా?

నిజాంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కేంద్రాలను ప్రారంభించారే తప్ప కొనుగోలు మాత్రం చేయడం లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తీగల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లేనిపక్షంలో రైతులతో రాస్తారోకోలు ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఆర్వోబీ లేక.. అన్నీ సమస్యలే



కోహీర్‌లో రైల్వే గేట్ వేయడంతో ఇరువైపులా భారీగా నిలిచిన వాహనాలు(ఫైల్)

- ప్రతిపాదనలు పంపినా స్పందన కరువు!
- కోహీర్‌లో రైల్వే గేటు పడిందంటే వాహనదారుల పరిస్థితి దారుణం
- నిత్యం వందలాది వాహనాల రాకపోకలు
- పరిసర ప్రాంతాలతో పాటు కర్ణాటక ప్రజలకు ఇదే ప్రధాన రహదారి
- హైట్‌గేజ్‌తో ఎత్తైన వాహనాలు వెళ్లలేని పరిస్థితి

కోహీర్, నవంబరు 5: (ఆంధ్రజ్యోతి): కోహీర్ మండల కేంద్రంలో గల 25వ రైల్వే గేట్‌తో వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ రైల్వే గేట్ నుంచి రోజూ వందల సంఖ్యలో వాహనాలు వస్తూ పోతూ ఉంటాయి. అరగంటకోసారి రైల్వే గేటు వేయడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. రైలు వచ్చే సమయంలో గేటు పడడంతో అత్యవసరమైన సమయాల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. కోహీర్‌లోని రైల్వేగేట్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) లేకపోవడంతో మండల పరిధిలోని 25 గ్రామాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఉద్యోగుల విద్యార్థులు, కూలీలు, చిరువ్యాపారులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారు.

ప్రతిపాదనలకు మోక్షమెన్నడో?

కోహీర్‌లోని 25వ రైల్వే గేట్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు గతంలో చాలా సందర్భాల్లో కోరారు. ప్రజల కోరిక మేరకు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసి రైల్వే ఉన్నతాధికారులకు పంపించినట్లు సమాచారం. అంతేకాకుండా ఏడాది క్రితం సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో నిర్వహించిన 166 డివిజనల్ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ (డీఆర్‌యూసీసీ) సమావేశంలో రైల్వే సలహా కమిటీ సభ్యులు షేక్ ఫరీద్ రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ ఇంతవరకూ ఆర్‌వోబీ నిర్మాణంపై రైల్వే అధికారులు ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడం గమనార్హం.

గంటల తరబడి నిరీక్షణ

కోహీర్ రైల్వే గేటు మీదుగా కర్ణాటక రాష్ట్రానికి చెందినవారితో పాటు వికారాబాద్ తాండూర్ ప్రాంతాలకు చెందినవారు కోహీర్ మండలానికి సంబంధించిన పలు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. పనుల నిమిత్తం ఈ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పాటు 65వ జాతీయ రహదారికి ఈ రైల్వే గేటు నుంచి ఉన్న ప్రధాన రహదారి అనుసంధానంగా ఉండడం వల్ల నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రైల్వే గేటు వేసినప్పుడు వాహనాలు ప్రయాణికులు గంటల తరబడి గేటు వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు, అధికారులు సమయానికి చేరుకోలేకపో తున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఆర్‌వోబీ నిర్మించాలని స్థానిక నాయకులు, రైల్వే అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందించినా స్పందన లేదని వాపోతున్నారు.

సరైన రోడ్డు కరువు

కోహీర్‌లోని 65వ రైల్వే గేటు వద్ద హైట్‌గేజ్‌ను ఏర్పాటు చేయడం వల్ల భారీ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఎక్కువ ఎత్తు గల వాహనాలు ఆ గేటు వైపు నుంచి వెళ్లేందుకు వీలుపడడం లేదు. ఈ రైల్వేలైన్‌పై వికారాబాద్ నుంచి బీదర్ వరకు విద్యుత్‌తో నడిచే రైళ్ల కోసం రైల్వే శాఖ విద్యుత్ తీగలను ఏర్పాటు చేసింది. భద్రత దృష్ట్యా రైల్వే అధికారులు ఈ రైల్వే గేటు వద్ద హైట్ గేజ్ ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కువ ఎత్తుగల వాహనాలు వెళ్లేందుకు వీలుపడకపోవడంతో భారీ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా రైల్వే గేటు వద్ద ఉన్న ప్రాంతంలో సరైన రోడ్డు కూడా లేకపోవడం వల్ల వర్షాకాలంలో రైల్వే గేటుకు ఇరువైపులా గుంతలుగా మారడంతో వర్షం నీరు నిలబడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైల్వే గేట్ వద్ద ఆర్‌వోబీ నిర్మిస్తే చాలావరకు సమస్యలు తీరుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

తపస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా





మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్‌ల ఎదుట చేపట్టిన నిరసనలో ఉపాధ్యాయసంఘాల నాయకులు

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డీఏతోపాటు పీఆర్సీ అమలు, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఉపాధ్యాయులు కదం తొక్కారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా శాఖల ఆధ్వర్యంలో మంగళవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట వేర్వేరుగా ధర్నా, నిరసన కార్యక్రమాలను చేపట్టారు. మెదక్ కలెక్టరేట్ ఎదుట తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తాని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మెదక్‌లో అదనపు కలెక్టర మెంచు నగేష్‌కు, సంగారెడ్డిలో కలెక్టరేట్ ఏవో పరమేశంకు వినతి పత్రాలను అందజేశారు. మెదక్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జిల్లా తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్లం, లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు భాస్కర్, రామారావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వరూపరాణి, జిల్లా బాధ్యులు, అన్ని మండలాల అధ్యక్షా, కారదర్శులు పాల్గొన్నారు. సంగారెడ్డిలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి, అడివప్ప, రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్, రాష్ట్ర నాయకులు నర్సింహారెడ్డి, బస్వరాజ్, సుధాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు గోపాల్, మల్లికార్జున్, చంద్రశేఖర్, తుకారం, తుక్కప్ప, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల సమయానికి బస్సులు నడిపించాలి

తూప్రాన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కళాశాల సమయానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యుడు జగన్ పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్ మండలం ఘనపూర్ బస్టాప్ వద్ద గజ్వేల్ - సంగారెడ్డి రహదారిపై విద్యార్థులు బైటాయించి రాస్తారోకో చేపట్టారు. ఘనపూర్ గ్రామానికి చెందిన 50 మంది విద్యార్థులు పలు కళాశాలల్లో చదువుతున్నారని, కళాశాల సమయానికి బస్సులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. కళాశాలల సమయం ఉదయం 9 గంటలకు ఉంటే బస్సులు 10:30గంటలకు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల సమయానికి బస్సులు నడిపించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.



ఘనపూర్ బస్ స్టాప్ చౌరస్తా వద్ద విద్యార్థుల రాస్తారోకో

ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లర్లకు చేర్చాలి: పద్మారెడ్డి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

మెదక్‌మున్సిపాలిటీ/ చేగుంట/ రామాయంపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దళారి వ్యవస్థను వెంటనే అరికట్టాలంటే ధాన్యాన్ని రైసుమిల్లులకు వెంటనే చేర్చాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె బీఆర్ఎస్ నేతలతో కలిసి అదనపు కలెక్టర్ మెంచు నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం తేమ శాతాన్ని 17కు పెంచి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లతో పాటు అన్ని రకాల వసతులు కేంద్రాల్లో కల్పించాలన్నారు. ఆమె వెంట జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లిఖార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.నార్సింగి మండలంలోని జప్తిశివనూర్, కాస్లాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి సందర్శించి పరిశీలించారు. అనంతరం రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నార్సింగి, చిన్నశంకరంపేట మండలాల అధ్యక్షులు మైలారం బాబు, పట్లూరి రాజు, మాజీ వైస్ ఎంపీపీ సుజాత, నాయకులు పాల్గొన్నారు. రామాయంపేటలోని ఎస్సీ కాలనీలో మంగళవారం ఆరబోసిన వరిధాన్యాన్ని చూసి ఎమ్మెల్యే పద్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పక్షం రోజులవుతున్నా ఇప్పటికీ వడ్లు వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతున్నాయి. కానీ కొనుగోళ్లు చేసే వారే లేరని ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు చిట్కుల్‌లో ఇంటింటి సర్వే

● కాంగ్రెస్ నాయకుడు నీలంమధుముదిరాజ్



పటాన్‌చెరు, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండాసురేఖ పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో బుధవారం ప్రారంభించనున్నట్టు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలంమధుముదిరాజ్ ప్రకటించారు. ఉదయం 8-30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమగ్ర సర్వే ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. దళారీ వ్యవస్థ లేని స్వచ్ఛమైనపాలన అందించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు.

సర్వేలో నిర్లక్ష్యం చేయొద్దు

మునిపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి సర్వేలో ఆయా శాఖల అధికారులు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేయరాదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల స్పెషలాఫీసర్ రామాచారి హెచ్చరించారు. సర్వేలో భాగంగా మంగళవారం మునిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు, ఎంపీవో అండాలమ్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవో బృందం

మెదక్ అర్బన్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మెంచు నగేష్‌ను టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ప్రభుత్వ పరిపాలనలో ఉద్యోగులందరూ ఉన్నతాధికారులకు సహకరిస్తూ.. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములమవుతామని ఈ సందర్భంగా నరేందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు ఇక్బాల్ పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఫజులొద్దీన్, మెదక్ యూనిట్ అధ్యక్షుడు రామాగౌడ్, పంచాయతీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు ప్రసవాలు..

(5వ పేజీ తరువాయి)

పొరుగు జిల్లాల నుంచి సైతం..

సంగారెడ్డి జిల్లాతో పాటు పక్కనున్న మెదక్, వికారాబాద్ జిల్లాల నుంచి కూడా కాన్పు కోసం గర్భిణులు ఇక్కడికి వస్తున్నారు. అనుభవం కలిగిన గైనకాలజిస్టులు, అనస్తీషియా, చిన్నపిల్లల వైద్యనిపుణులు సమక్షంలో అతిక్లిష్టమైన (హైరిస్క్) కాన్పులు కూడా సమర్థవంతంగా చేస్తున్నారు. మాతా శిశు మరణాలు జరగకుండా గర్భిణికి సుఖప్రసవం జరిగేలా ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల నర్సమ్మ అనే మహిళ 8 నెలల గర్భంతో రెండవ కాన్పు కోసం వచ్చింది. ఆమెను వైద్యులు పరీక్షించగా బిడ్డ గర్భంలోనే చనిపోయి, గర్భసంచి నుంచి విడిపోయి అధిక రక్తస్రావం జరిగిందని గుర్తించారు. ఇటువంటి పరిస్థితిలో అత్యవసర శస్త్ర చికిత్స చేసి తదుపరి 30 యూనిట్ల రక్తం, ఎఫ్ఎఫ్‌పీ రక్తకణాలను ఎక్కించి తల్లి ప్రాణాలను కాపాడారు ఇక్కడి వైద్యులు.

రైతులను ఇబ్బందులు పెట్టొద్దు



పుల్కల్: ధాన్యంలో తేమను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

పుల్‌కల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులను ఇబ్బందులు పెట్టొదని, కొనుగోళ్లు వెనువెంటనే చేపట్టాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి సూచించారు. మంగళవారం కోడూరు, ముదిమాణిక్యం గ్రామాలలో ఆరబెట్టిన వరి ధాన్యాన్ని, కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. దీంతో పాటు పుల్కల్, ముదిమాణిక్యం గ్రామాల శివారు ప్రాంతాల్లో గల రైస్‌మిల్లులను కూడా సందర్శించారు. కాంటా చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. మిల్లుల్లో ధాన్యం త్వరగా అన్‌లోడ్ చేసి వెంటవెంటనే లారీలను కేంద్రాలకు పంపాలని మిల్లుల యజమానులను ఆదేశించారు. రెవెన్యూ, పౌర సరఫరాలు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు లేకుండా చూడాలన్నారు.

●నారాయణఖేడ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం తహసీల్దార్ భాస్కర్, ఏఈవో సురేష్‌లతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఫోన్ ద్వారా రైస్ మిల్లర్లతో ఆర్డీవో అశోక చక్రవర్తి మాట్లాడి కొనుగోళ్లు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.

● కంగ్టి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంబికె లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మార్వో అబ్దుల్ నజీంఖాన్‌పరిశీలించారు. కేంద్రాల్లో రైతుల కోసం ఎలాంటి వసతులు కల్పించారని ఐకేపీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

● చిన్నశంకరంపేట, నవంబరు(ఆంధ్రజ్యోతి) 5: జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని సివిల్ సప్లై డీఎం హరికృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని కొరివిపల్లి, కుర్మపల్లి గ్రామాల్లోనిని ధాన్యం కొనుగోలు కేంద్రాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని తెలిపారు. కొరివిపల్లిలో ధాన్యం శుభ్రం చేయక పోవడం మూలంగా విక్రయాలు ప్రారంభం కాలేదన్నారు.

● కౌడిపల్లి, నవంబరు (ఆంధ్రజ్యోతి) 5: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగుల కొరత లేకుండా చూడాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. మంగళవారం మండలంలోని నాగ్‌సాన్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. తనికి చేశారు.

● వెల్దుర్తి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యంను దళారులకు అమ్మి మోసపోవద్దని సొసైటీ సీఈవో సిద్దయ్య సూచించారు. మంగళవారం మండలంలోని ఎదులపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

● టేక్మాల్ నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్వంచ, బర్దిపూర్, కాద్లూర్ గ్రామాల్లో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను టేక్మాల్ సీవో శివకుమార్ ప్రారంభించారు

● మాసాయిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చంపేట గ్రామంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి జ్ఞానజ్యోతి ప్రారంభించారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

చిన్నశంకరంపేట్, నవంబరు(ఆంధ్రజ్యోతి) 5: గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 12 గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని కురుమపల్లిలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధిత కుటుంసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్లస్వామికి చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో గొర్రెలు మృతి చెందాయి. దీంతో రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని, ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరాడు.

రూ.28.36కోట్లతో పర్యాటక కేంద్రాలుగా చెరువులు



సాకిచెరువు పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

పటాన్‌చెరు, నవంబరు 5: పటాన్‌చెరు పట్టణంలోని విశాలమైన సాకిచెరువు, తిమ్మక్క చెరువు, ముత్తంగి ఎన్నంచెరువులను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంగా రూ. 28.36కోట్లతో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి పరుస్తున్నామని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ చెరువుల విభాగం అధికారులతో కలిసి మంగళవారం మూడు చెరువులకు పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులకు ఏ విధంగా అభివృద్ధి చేయబోతున్నామన్న డ్రాయింగ్‌లను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, హెచ్‌ఎండీఏ చెరువుల విభాగం డీఈ రామారావు, జీహెచ్‌ఎంసీ డీఈ నళిని, తెల్లాపూర్ కమిషనర్ సంగారెడ్డి, ముత్తంగి మాజీ సర్పంచ్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవులు రాజకీయంగా ఎదగాలి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం నాయకులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వీరశైవులు రాజకీయంగా ఎదగాలని వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ అన్నారు. సంగారెడ్డిలోని సంఘం కార్యాలయంలో మంగళవారం బ్రోచర్ అవిష్కరించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కుల గణనలో వీరశైవులందరూ వీరశైవ లింగాయత్ లింగ బలిజగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధ్యక్షుడు పట్లోళ్ల శివశరన్, జీహెచ్‌ఎంసీ కోశాధికారి పరమేష్, మీడియా ఇన్‌చార్జి రఘు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్, రాష్ట్ర కార్యదర్శి రాకేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ధనుంజయ, అధ్యక్షుడు పథ్విరాజు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ పాటిల్, సభ్యులు పాల్గొన్నారు.

గొల్ల కురుమలు బీసీ(బీ)గా రాయించండి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం మండల అధ్యక్షుడు తాటిపల్లి మల్లేశం

మునిపల్లి, నవంబరు 5: (ఆంధ్రజ్యోతి): గొల్ల కురమలు ప్రతి ఒక్కరూ బీసీ-బీగా ఇంటింటి సమగ్ర సర్వేలో రాయించాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు తాటిపల్లి మల్లేశం సూచించారు. మంగళవారం బుదేరాలోని ఎల్లలింగ ఆశ్రమంలో మండలంలోని ఆయా గ్రామాల కురుమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే ద్వారా కురుమల సత్తా చాటేందుకు ఇది చక్కటి అవకాశమన్నారు. సమావేశంలో కురుమ సంఘం మాజీ అధ్యక్షుడు శంకరయ్య, సంఘం నాయకులు మహేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలను తనిఖీ చేసిన జిల్లా అధికారి

పుల్‌కల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్‌లోని పశు వైద్యశాలను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వసంతకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహణపై స్థానిక డాక్టర్ విశాల్‌కుమార్, సహాయకుడు ప్రభాకర్‌లను అడిగి తెలుసుకున్నారు.

దౌల్తాబాద్‌లో ఆటో డ్రైవర్ల ధర్నా

హత్నూర, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని దౌల్తాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో ఆటో డ్రైవర్ల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు శేఖర్, మారుతి రాజు మాట్లాడుతూ ప్రభుత్వం బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

13న ఖేడ్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నారాయణఖేడ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఖేడ్ నుంచి ప్రత్యేక ప్యాకేజీతో అరుణాచలానికి ఈ నెల 13న ప్రత్యేక బస్సును నడుపుతున్నామని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బస్సు ఈనెల 13న సాయంత్రం 4 గంటలకు ఖేడ్ నుంచి బయలు దేరి, 14న కాణిపాకంలో వినాయకుడి దర్శనం అనంతరం అదే రోజు వేలూరు గోల్డెన్ టెంపుల్‌లోని మహాలక్ష్మి అమ్మవారి దర్శనం తర్వాత బయలు దేరి రాత్రి 7 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. 15న ఉదయం భక్తులు అరుణాచలం గిరి ప్రదక్షిణ చేయవచ్చన్నారు. తిరిగి అదే రోజు సాయంత్రం బస్సు అక్కడి నుంచి బయలు దేరి 16న జోగులాంబ శక్తి పీఠం అమ్మవారిని దర్శనం అనంతరం సాయంత్రం ఖేడ్‌కు చేరుకుంటుందని వివరించారు. రానుపోను చార్జి ఒక్కొక్కరికి రూ.4,500 మాత్రమేనన్నారు. పూర్తివివరాల కోసం 9959223170, 9704885694, 9676667703, 9441071134 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

కానుకుంటలో ప్రభుత్వ భూమిని కాపాడండి

గుమ్మడిదల నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానుకుంటలో ప్రభుత్వ భూమిని కొందరు కాజేసేందుకు యత్నిస్తున్నారని, తక్షణమే అధికారులు ఆ భూమిని కాపాడాలని గ్రామస్థులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కానుకుంట గ్రామంలోని సర్వే నంబర్ 976 లో గల ప్రభుత్వ భూములో పేదల కోసం 2005లో అసైన్డ్ ద్వారా ప్రభుత్వ భూమి అందజేసి సర్టిఫికెట్లు ఇచ్చినట్టు తెలిపారు. ఈ సర్వేనంబర్‌లోని భూమిని కొందరు అమ్ముకొని ప్రభుత్వ భూమిని కాజేసే యత్నం చేస్తున్నారని ఆరోపించారు.